క్లుప్తంగా

రక్తదానం అభినందనీయం



రక్తదానం చేస్తున్న విద్యార్థిని

రాజమహేంద్రవరం సిటీ: రక్తదానం మరొకరి ప్రాణాలు కాపాడుతుందని, రక్తదానం చేసేందుకు విద్యార్థినులు ధైర్యంగా ముందుకు రావడం అభినందనీయమని రాజమహేంద్రి విద్యాసంస్థల చైర్మన్ టీకే విశ్వేశ్వరరెడ్డి అన్నారు. ఆయుష్మాన్ భవ భారత్ కార్యక్రమంలో భాగంగా సోమవారం స్థానిక గోకవరం బస్టాండ్ వద్ద ఉన్న రాజమహేంద్రి మహిళా జూనియర్, డిగ్రీ, పీజీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, విద్యార్థినులు రక్తదానం చేశారు. విశ్వేశ్వరరెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మూడు నెలలకు ఒకసారి రక్తదానం చేయవచ్చన్నారు. జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ లో బ్లడ్‌బ్యాంక్ ఎల్‌టీ జూనియర్ డాక్టర్ బద్రి సూర్యనాగు విద్యార్థులకు రక్తం ఆవశ్యకతను వివరించారు.

అన్నసమారాధన

ధవళేశ్వరం: గణపతి నవరాత్ర ఉత్సవాల్లో భాగంగా సోమవారం ధవళేశ్వరం రథంవీధిలో ఏర్పాటు చేసిన వరసిద్ధి వినాయక మండపం వద్ద యడ్ల మహేష్ ఆధ్వర్యంలో అన్నసమారాధన నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి అన్నప్రసాదం స్వీకరించారు. కార్యక్రమంలో రథంవీధి ఫ్రెండ్స్ సర్కిల్ గీతా బాబీ, ఆకోజు ఏసు వరప్రసాద్, ఎర్రనేటి లోవ రాజు, దిండి జగదీష్, సింగారెడ్డి సత్తిబాబు, కవల నాగరాజు, నరుకుల రాజు, కొప్పిశెట్టి గాంధీ పాల్గొన్నారు.

బైక్ జాతాకు స్వాగతం

కడియం: యూటీఎఫ్ స్వర్ణోత్సవ బైక్ జాతా సోమవారం కడియం చేరుకుంది. జాతాకు స్థానిక నాయకులు ఘన స్వాగతం పలికారు. శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం నుంచి ఈ జాతా ప్రారంభమైన విషయం విదితమే. కాగా కడియం బ్రాహ్మణరేవు వద్ద ఏర్పాటు చేసిన యూటీఎఫ్ పతాకాన్ని, స్వర్ణోత్సవ పైలాన్‌ను ఆవిష్కరించారు. యూటీఎఫ్ నాయకులు కేఎస్ఎస్ ప్రసాద్, కె.వీరభద్రరావు, అరుణకుమారి, షరీఫ్, ఈవీఎస్ఆర్ ప్రసాద్, విజయగౌరీ, చిలుకూరి శ్రీనివాసరావు, అనిత, ఆనంద్ విజయ్‌కుమార్, ఆకుల వీర్రాజు, అబ్బాయి, వేదుల శాస్త్రి, ఫ్లోరెన్స్, సూరిబాబు, హనుమంతరావు, రాజు పాల్గొన్నారు.

కలెక్టరేట్ వద్ద ధర్నా

సీటీఆర్ఐ: తమ సమస్యలు పరిష్కరించాలంటూ ఏపీ మధ్యాహ్న భోజన కార్మిక సంఘం (సీఐటీయూ) ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద సోమవారం కార్మికులు ధర్నా చేపట్టారు. జిల్లాలోని పలు మండలాల నుంచి కార్మికులు తరలి వచ్చారు. ధర్నా అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. చిట్టా బేబీ, నాగమణి, అమ్మాజీ తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు సాయం



బాధితులకు సాయం అందజేస్తున్న గిరజాల బాబు తదితరులు

కడియం: మండలంలోని వేమగిరిలో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధితులకు బాధ్యత సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి గిరజాల వీర్రాజు (బాబు) సోమవారం సాయం అందజేశారు. బాధితులను పరామర్శించి, ప్రమాద వివరాలు తెలుసుకున్నారు. అనంతరం వారికి నిత్యావసర వస్తువులు, దుస్తులు, నగదు అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ సూరపురెడ్డి జానకి రామయ్య, స్థానిక నాయకులు పిల్లి సుబ్రహ్మణ్యం, చిలుకూరి రామకృష్ణ, ఆర్ఎస్ఎన్ మూర్తి, సర్కార్ బాషా పాల్గొన్నారు.

కరాటే పోటీలకు కిరణ్మయి

ప్రకాశం నగర్: కందుకూరి రాజ్యలక్ష్మి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో సీనియర్ ఇంటర్ చదువుతున్న కె.వెంకట కిరణ్మయి రాష్ట్రస్థాయి కరాటే పోటీలకు ఎంపికైంది. ఈ విషయాన్ని కళాశాల పీడీ వై.సుధారాణి సోమవారం ప్రకటనలో తెలిపారు. ఇటీవల కాకినాడలో జరిగిన జిల్లా కరాటే పోటీలలో విజేతగా నిలిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికై ందన్నారు. ఆ విద్యార్థినిని కళాశాల ప్రిన్సిపాల్ పి.రాఘవ కుమారి అభినందించారు.

బాధ్యతల స్వీకరణ



ఎస్పీ జగదీష్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న సీఐ పుల్లారావు

కంబాలచెరువు: ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా వి.పుల్లారావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ పి.జగదీష్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. లా అండ్ ఆర్డర్ నిర్వహణ, ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఆయనకు ఎస్పీ సూచించారు.

పర్యావరణ రక్షణకు ముందడుగు

- ఆర్ట్స్ కళాశాలలో వెహికల్ ఫ్రీడే
- నెలలో రెండుసార్లు నిర్వహణ
- ఆ రోజుల్లో నడిచి వస్తున్న విద్యార్థులు, అధ్యాపకులు



వెహికల్ ఫ్రీడే సందర్భంగా కళాశాలకు నడిచివస్తున్న అధ్యాపకులు (ఫైల్)

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): వాయు కాలుష్యం నివారణ, పర్యావరణ పరిరక్షణ, ఇంధన పొదుపునకు రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల శ్రీకారం చుట్టింది. నెలలో రెండు సార్లు వాహనాలు ఉపయోగించకుండా అందరూ కళాశాలకు వచ్చేలా ప్రణాళిక తయారు చేసింది. పర్యావరణ పరిరక్షణతో పాటు వాహనం ఉపయోగించకపోవడంతో నడిచి రావడం వల్ల ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు సమకూరనున్నాయి. ఈ సామాజిక బాధ్యతలో అందరం పాలుపంచుకోవాలని కళాశాల పిలుపునిచ్చింది.

ముందురోజే సమాచారం

ప్రతి నెలా రెండు, నాలుగో శుక్రవారం వెహికల్ ఫ్రీడే నిర్వహిస్తోంది. ఆ రోజుల్లో కళాశాల ప్రధాన గేట్లు అన్నీ మూసివేస్తారు. ఎట్టి పరిస్థితుల్లోనూ మోటారు వాహనాలను లోపలకు అనుమతించరు. నడిచివెళ్లే పాదచారులు, అలాగే సైకిల్‌పై వెళ్లే విధంగా చిన్న ద్వారం మాత్రమే తెరిచి ఉంచుతారు. ఈ కార్యక్రమం ఎంపిక చేసిన రోజుల్లో ఉదయం 8 నుంచి రాత్రి 8 గంటల వరకు అమలులో ఉంటుంది. రెండు, నాలుగో శుక్రవారం కళాశాలకు వాహనాలతో రాకూడదని ఆ ముందురోజే ఎన్ఎస్ఎస్ విద్యార్థులలో కళాశాలలో అందరికీ సమాచారం ఇస్తారు.

విజయవంతం

తొలిసారిగా ఈనెల 22న నిర్వహించిన వెహికల్ ఫ్రీడే విజయవంతమైంది. దీనిపై విద్యార్థులకు పూర్తిస్థాయి అవగాహన కల్పిస్తున్నారు. ఇంధన పొదుపు, నడకతో చేకూరే ఆరోగ్య ప్రయోజనాలను వివరిస్తున్నారు. మోటారు వాహనం వీడి సైకిల్ ఉపయోగించడం వల్ల కలిగే లాభాలు వివరిస్తున్నారు. కళాశాలలో విద్యార్థులందరినీ పర్యావరణ హితులుగా, సామాజిక బాధ్యత కలవారిగా తయారు చేయడమే వెహికల్ ఫ్రీడే ప్రధాన లక్ష్యం.

అనేక ప్రయోజనాలు



వెహికల్ ఫ్రీడే వల్ల అనేక ప్రయోజనాలున్నాయి. నెలలో రెండు రోజుల పాటు ఈ కార్యక్రమం అమలు చేస్తాం. సమయ పాలన, ఇంధన పొదుపు, పర్యావరణ రక్షణ సాధ్యమవుతుంది. కళాశాలకు నడిచి రావడం వల్ల నడకతో ఆరోగ్యం చేకూరుతుంది.
– డాక్టర్ కె.రామచంద్రరావు, ప్రిన్సిపాల్, ఆర్ట్స్ కళాశాల

ఆ రోజుల్లో కళాశాల అధ్యాపకులు, ఇతర సిబ్బంది, విద్యార్థులు ప్రభుత్వ రవాణా వ్యవస్థను ఉపయోగించేలా ప్రేరేపిస్తున్నారు.



ఉత్సాహంగా నడిచివస్తున్న విద్యార్థులు, సిబ్బంది

దేశాభివృద్ధిలో యువతదే కీలకపాత్ర



జీడిమామిడి మొక్కలు నాటుతున్న శ్యామ్‌రాజు నాయక్, విద్యార్థులు

రాజమహేంద్రవరం రూరల్: దేశాభివృద్ధిలో యువత కీలకపాత్ర పోషించాలని వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ చవాన్ శ్యామ్ రాజు నాయక్ అన్నారు. కాతేరు వ్యవసాయ కళాశాలలో సోమవారం జాతీయ సేవా పథకం వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా నిర్వహించిన జాతీయ స్వచ్ఛత పక్షోత్సవాల కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే సేవాభావం, క్రమశిక్షణ, సమాజంపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఇందులో భాగంగా నిడిగట్ల వ్యవసాయ క్షేత్రంలో విద్యార్థులతో 350 జీడి మామిడి మొక్కలను నాలుగు ఎకరాల విస్తీర్ణంలో నాటించారు. ఎన్ఎస్ఎస్ అధికారులు డాక్టర్ పి.అమ్మాజీ, డాక్టర్ జి.రమేష్ మాట్లాడుతూ జాతీయ సేవా పథకం ద్వారా వారు పొందిన అనుభూతిని తెలియజేశారు.

రాజీయోగ్యమైన వివాదాల పరిష్కారం



లీగల్ ఎయిడ్ క్లినిక్‌ను పరిశీలిస్తున్న సీనియర్ జడ్జి ప్రత్యూష కుమారి

రాజమహేంద్రవరం రూరల్: జిల్లా న్యాయసేవాధికార సంస్థలోని ఏడీఆర్, మీడియేషన్ ప్రక్రియల ద్వారా న్యాయవాదుల సహాయంతో రాజీయోగ్యమైన అన్ని వివాదాలు పరిష్కరించబడతాయని ఆ సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రత్యూష కుమారి అన్నారు. దీనివల్ల ఇరుపక్షాలకూ సత్వర పరిష్కారం లభిస్తుందన్నారు. ఆమె సోమవారం పిడింగొయ్యిలోని జీఎస్‌కేఎం లా కళాశాలలోని లీగల్ ఎయిడ్ క్లినిక్‌ను సందర్శించారు. అక్కడ క్లినిక్ కార్యనిర్వాహక బృందంతో మాట్లాడిన అనంతరం ఏడీఆర్, మీడియేషన్ ప్రక్రియల ద్వారా న్యాయ సమస్యల పరిష్కారంపై న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. జీఎస్‌కేఎం కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.మధుసూదనరావు, సీనియర్ ఫ్యాకల్టీ పి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

దసరా ఉత్సవాలకు రాట ముహూర్తం



రాట ముహూర్తంలో పాల్గొన్న మహిళలు

సీటీఆర్ఐ: కోరుకొండ రోడ్డులోని కనక దుర్గాసాయి మందిరం వద్ద సోమవారం దసరా ఉత్సవాలకు రాట ముహూర్తం చేశారు. ఉత్సవ కమిటీ ప్రతినిధులు జొన్నాడ సుబ్బారావు, శ్రీదేవి దంపతులు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. అనంతరం ఉత్సవ కమిటీ ప్రతినిధులు మాట్లాడుతూ అక్టోబర్ 15 నుంచి 24వ తేదీ వరకూ దేవీ నవరాత్ర ఉత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. తొమ్మిది రోజుల పాటు నిత్యం అమ్మవారికి కుంకుమ పూజలు జరుగుతాయన్నారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ ప్రతినిధులు బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు రేలంగి శ్రీదేవి, దుద్దుపూడి శ్రీనువాసు, జవ్వాది మురళీ కృష్ణ, జొన్నాడ భజే నారాయణ, జొన్నాడ దుర్గారావు పాల్గొన్నారు.

ధవళేశ్వరం గ్రామాభివృద్ధికి కృషి



అభివృద్ధి పనుల శంకుస్థాపనలో పాల్గొన్న చందన నాగేశ్వర్ తదితరులు

- వైఎస్సార్ సీపీ కో ఆర్డినేటర్ చందన నాగేశ్వర్
- రూ.కోటితో రోడ్లు, డ్రెనేజీ నిర్మాణ పనులకు శ్రీకారం

ధవళేశ్వరం: ధవళేశ్వరం గ్రామాభివృద్ధికి కృషి చేస్తానని వైఎస్సార్ సీపీ రూరల్ కో ఆర్డినేటర్, ఆంధ్రప్రదేశ్ పచ్చదనం, సుందరీకరణ కార్పొరేషన్ చైర్మన్ చందన నాగేశ్వర్ అన్నారు. గ్రామంలోని ఐదు సచివాలయాల పరిధిలో రూ.కోటి వ్యయంతో నిర్మించనున్న పలు రోడ్లు, డ్రైనేజీలకు సోమవారం సాయంత్రం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామంలోని సమస్యలను పరిష్కరించేందుకు ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళతామన్నారు. ప్రస్తుతం అత్యవసరంగా చేపట్టాల్సిన డ్రైనేజీలను గుర్తించి వాటిని రూ.కోటి వ్యయంతో నిర్మించనున్నామన్నారు. ధవళేశ్వరం సచివాలయం 1 పరిధిలోని పంచాల రేవు రిపేర్ల పనులకు, సచివాలయం 2 పరిధిలో వాడపేట నేతాజీ స్కూల్ ఏరియాలో సీసీ డ్రైన్ నిర్మాణ పనులకు, సచివాలయం 3 పరిధి మార్కెట్ ఏరియాలో సీసీ డ్రైన్ నిర్మాణ పనులకు, సచివాలయం 4 పరిధిలో జూనియర్ కాలేజీ ఎదురు వీధిలో లక్ష్మీ జనార్దనస్వామి ఆర్చి దగ్గర నుంచి సీసీ రోడ్డు, డ్రైనేజీ నిర్మాణానికి సచివాలయం 5 పరిధి రాజీవ్ కాలనీ ఏరియా, ఎర్రకొండ కనకదుర్గమ్మ గుడి వద్ద, క్రిస్టియన్ బరియల్ గ్రౌండ్‌లో సీసీ డ్రైన్ నిర్మాణ పనులకు శంకుస్థాపనలు చేశారు. కార్యక్రమంలో వివిధ విభాగాల కార్పొరేషన్ డైరెక్టర్లు, సచివాలయ కన్వీనర్లు, కార్యకర్తలు, పంచాయతీ అధికారులు పాల్గొన్నారు.

సమయపాలన, ఏకాగ్రతతో లక్ష్యసాధన



ఆరు పతకాలు అందుకున్న ఎంబీబీఎస్ ఫైనలియర్ విద్యార్థిని పసుపులేటి లక్ష్మీత్రిష

- ప్రముఖ మానసిక వైద్యుడు కర్రి రామారెడ్డి
- ఘనంగా జీఎస్ఎల్ వైద్య కళాశాల వార్షికోత్సవం

రాజానగరం: ఎంచుకున్న లక్ష్యాన్ని సాధించాలంటే తపనతో పాటు సమయ పాలన, ఏకాగ్రత ఉండాలని ప్రముఖ మానసిక వైద్యుడు డాక్టర్ కర్రి రామారెడ్డి అన్నారు. స్థానిక జీఎస్ఎల్ వైద్య కళాశాల వార్షికోత్సవం సోమవారం రాత్రి ఘనంగా జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ లక్ష్యాన్ని ఎంచుకోవడమే కాదు, దానిని సాధించాలనే చాలెంజ్‌తో ముందుకెళ్లాలని సూచించారు. మీ వయసులో ఉండగా వైద్య విద్యను అభ్యసించాలనుకున్నానని, కానీ ఎంబీబీఎస్‌లో ఫ్రీ సీటు రాక రూ. 7500 డొనేషన్ కట్టానని, అయినా గానీ వెయిటింగ్ లిస్టులో ఉండక తప్పలేదన్నారు. దీనితో వైద్య విద్యను ఒక చాలెంజ్‌గా తీసుకుని, ఆ పై ప్రతి ఏటా గోల్డ్ మెడల్స్ అందుకుంటూనే ఉన్నానంటూ తన స్వీయ అనుభవాన్ని వైద్య విద్యార్థులకు వివరించారు. సబ్జెక్టుపై అవగాహన ఉంటే మంచి మార్కులు వస్తాయి, రోగులపై సానుభూతితో ఉంటే మంచి డాక్టర్ కావొచ్చన్నారు. కళాశాల చైర్మన్ డాక్టర్ గన్ని భాస్కరరావు మాట్లాడుతూ వైద్య శాస్త్రంతోపాటు ఇతర శాస్త్రాలలో ఇంతవరకు 34 డిగ్రీలు పూర్తి చేశారని డాక్టర్ కర్రి రామారెడ్డి గురించి విద్యార్థులకు తెలియజేశారు. ప్రిన్సిపాల్ డాక్టర్ వి.గురునాథ్ వైద్య కళాశాల ప్రగతిని, అమలు చేస్తున్న వివిధ కోర్సుల గురించి వివరించారు. చదువులో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు పతకాలు అందజేశారు.

శభాష్ కావ్య

- చదువుకోవాలనే పట్టుదల ఆదర్శనీయం
- అభినందించిన కలెక్టర్ మాధవీలత



విద్యార్థి కావ్యతో మాట్లాడుతున్న కలెక్టర్ మాధవీలత

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): తల్లిదండ్రుల ఒత్తిడితో బాల్య వివాహం చేసుకున్నా, పట్టుదలలో చదువుకుంటున్న కావ్యను బాలికలు ఆదర్శంగా తీసుకోవాలని కలెక్టర్ కె.మాధవీలత అన్నారు. స్థానిక కందుకూరి రాజ్యలక్ష్మి మహిళా కళాశాలలో చదువుకుంటున్న బాలికను సోమవారం ఆమె కలిసి అభినందించారు. వివరాల్లోకి వెళితే.. తల్లిదండ్రులు, బంధువుల ఒత్తిడితో రెండేళ్ల క్రితం 14 ఏళ్ల వయసులో కోరుకొండ మండలం శ్రీరంగపట్నానికి చెందిన కావ్య వివాహం చేసుకుంది. అయితే చదువు కోవాలనే ఆశయంతో వివాహం అనంతరం కాకినాడ జిల్లా ఇరుపాక గ్రామంలోని తన మేనమామ ఇంటిలో ఉంటూ ఏలేశ్వరం బాలికల పాఠశాలలో పదో తరగతి పూర్తి చేసింది. కోరుకొండ సరస్వతి విద్యాలయంలో ఇంటర్ దూర విద్యలో చేరింది. అయితే తనకు చదువుకోవాలని ఉందని 100 నంబర్‌కి ఫోన్ చేసి తెలిపింది. వెంటనే ఐసీడీఎస్ అధికారులు స్పందించి, ఆ బాలికకు సాయం చేశారు. ప్రస్తుతం ఆమెకు 16 ఏళ్లు రావడంతో రాజమహేంద్రవరంలోని మహిళా స్టేట్ హోమ్‌లో ఉచితంగా వసతి కల్పించారు. ప్రవేశ సమయం ముగిసినా చొరవ తీసుకుని, ప్రత్యేక కేసుగా పరిగణించి ఉమెన్స్ కళాశాలలో ఇంటర్‌లో చేర్పించారు. ఈ సందర్భంగా కావ్య మాట్లాడుతూ తనకు చిన్నప్పటి నుంచీ చదువుకోవాలని ఉండేదని తెలిపింది. అయితే ఇంటిలో పెళ్లి చేసేయడంతో చేసేదేమీలేక 100కు ఫోన్ చేసి చెప్పానంది. తనకు ధైర్యం చెప్పి, అండగా నిలబడిన కలెక్టర్‌కు జీవితాంతం రుణపడి ఉంటానని తెలిపింది. కలెక్టర్ మాధవీలత మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 907 మంది బాల్య వివాహ బాలికలకు రక్షణ కల్పిస్తున్నామన్నారు. బాలల హక్కుల పరిరక్షణకు 1098 చైల్డ్ లైన్ టోల్ ఫ్రీ నంబర్ 24 గంటలూ అందుబాటులో ఉంటుందన్నారు. బాలల ఉచిత నిర్బంధ విద్యాహక్కుకు 18004253535 టోల్ ఫ్రీ నంబర్ ఉందన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ పి.రాఘవ కుమారి, జిల్లా స్త్రీ,శిశు సంరక్షణ అధికారి కె.విజయకుమారి పాల్గొన్నారు.

బంగారం, వెండి వస్తువుల చోరీ

రాజమహేంద్రవరం రూరల్: ఆసుపత్రికి వెళ్లిన సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు ఇంటిలోకి ప్రవేశించి 15 కాసుల బంగారం వస్తువులు, రెండు కేజీల వెండి వస్తువులు చోరీ చేశారని బొమ్మూరు సత్యానారాయణనగర్ రెండవ వీధికి చెందిన చిన్నపువ్వుల శ్రీఫణికృష్ణ సోమవారం బొమ్మూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆయన ఈనెల 22వ తేదీ సాయంత్రం ఐదు గంటల సమయంలో పాపకు ఆరోగ్యం బాగాలేదని ఆస్పత్రికి తీసుకువెళ్లారు. తిరిగి రాత్రి 8 గంటల సమయంలో ఇంటికి రాగా తలుపులు పగలు కొట్టి ఉన్నాయి. లోపలకు వెళ్లి పరిశీలించగా బీరువాలోని బంగారం, వెండి వస్తువులు మాయమయ్యాయి. ఇన్‌స్పెక్టర్ ఆర్.విజయ కుమార్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సోమనవారితోటలో..

వడ్డాది ఆనంద్ ప్రకాష్ బొమ్మూరు సోమనవారి తోటలోని నాలుగో వీధిలో నివసిస్తున్నారు. ఆదివారం సాయంత్రం సోమనవారితోట ఒకటో వీధిలో ఉంటున్న ఆనంద్ ప్రకాష్ కుటుంబ సభ్యులతో అతని తండ్రి ఇంటికి వెళ్లారు. తిరిగి రాత్రి 8.15 గంటల సమయంలో ఇంటికి రాగా తలుపులు పగలుగొట్టి ఉన్నాయి. లోపలికి వెళ్లిచూడగా బీరువాలోని 15 కాసుల బంగారం వస్తువులు, రూ.95 వేలు మాయమయ్యాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు ఇన్‌స్పెక్టర్ ఆర్.విజయకుమార్ కేసు నమోదు చేశారు. సంఘటనా స్థలంలో క్లూస్ టీమ్ వేలిముద్రలను సేకరించింది.

యువతకు ప్రతిభా పోటీలు

రాజమహేంద్రవరం సిటీ: యువతలో ప్రతిభ వెలికి తీసేందుకు రోటరీ క్లబ్ ఆఫ్ రాజమండ్రి ఆధ్వర్యంలో వివిధ అంశాలలో పోటీలు నిర్వహించినట్లు చైర్మన్ తోట సుబ్బారావు తెలిపారు. స్థానిక వై.జంక్షన్‌లోని ఆనం రోటరీ హాల్లో ఈ నెల 8 నుంచి 25 వరకూ సాంస్కృతిక, నృత్య పోటీలు, చిత్రలేఖనం, వ్యాసరచన, వకృత్వ, క్విజ్, అన్నమాచార్య కీర్తనలు తదితర అంశాలలో పోటీలు జరిగాయన్నారు. విజేతలకు అక్టోబర్ 8వ తేదీ సాయంత్రం 6 గంటలకు బహుమతులు ప్రదానం చేస్తామన్నారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు



సమస్యలు తెలుసుకుంటున్న డాక్టర్ గూడూరి శ్రీనివాస్

రాజమహేంద్రవరం సిటీ: ప్రజలు క్షేత్రస్థాయిలో తెలిపిన సమస్యలను నగరపాలకసంస్థ అధికారులతో చర్చించి, సత్వరం పరిష్కరిస్తానని వైఎస్సార్ సీపీ సిటీ కో ఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్ తెలిపారు. డివిజన్ల వారీగా ఎక్కడి సమస్యలను అక్కడే పరిష్కరించే దిశగా నగర పర్యటన మొదలు పెట్టిన ఆయన.. సోమవారం ఒకటో డివిజన్‌లో వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి ముప్పన ప్రభాకర చౌదరి ఆధ్వర్యంలో పర్యటించారు. బత్తిన నగర్‌లో పలు సమస్యలను గుర్తించి సంబంధిత క్షేత్రస్థాయి అధికారులతో మాట్లాడి అక్కడికక్కడే పరిష్కరించే దిశగా చర్యలు తీసుకున్నారు.

పేదల ఇంటిని ఎందుకు కూల్చేశారు!

- అధికారులపై ఎంపీ భరత్ రామ్ ఆగ్రహం
- బాధిత కుటుంబానికి భరోసా



రచ్చబండలో సమస్యలు తెలుసుకుంటున్న ఎంపీ భరత్ రామ్

రాజమహేంద్రవరం రూరల్: అరసెంటు భూమిలో అప్పు చేసి చిన్న ఇల్లు కట్టుకుంటుంటే.. అక్రమంటూ అధికారులు కూల్చేశారని ఓ బాధిత కుటుంబం సోమవారం ఎంపీ మార్గాని భరత్ రామ్ ఎదుట ఆవేదన వ్యక్తం చేసింది. వారి ఆవేదనకు చలించిన ఎంపీ మాట్లాడుతూ న్యాయం ఉంటే తప్పక సహకరిస్తా.. బాధపడొద్దని ధైర్యం చెప్పారు. సోమవారం వీఎల్ పురం మార్గాని ఎస్టేట్స్ ప్రాంగణంలోని ఎంపీ కార్యాలయం వద్ద నిర్వహించిన రచ్చబండలో ఈ ఘటన జరిగింది. బాధితుల నుంచి సమగ్రంగా వివరాలు తెలుసుకున్న ఎంపీ నగరపాలక సంస్థ కార్యాలయంలో సంబంధిత అధికారికి నేరుగా ఫోన్ చేశారు. నగరంలోని ఐఎల్‌టీడీ వద్ద ఓ నిరుపేద కుటుంబం ఇల్లు కట్టుకుంటే ఎందుకు కూల్చేశారని ప్రశ్నించారు. ఒకవైపు పేదలకు ఇళ్ల స్థలాలు, ఇల్లు కట్టుకోవడానికి సీఎం జగన్ అన్ని విధాలా సహకరిస్తుంటే, మీరు ఇలా ఎందుకు వ్యవహరిస్తున్నారని ప్రశ్నించారు. కేవలం 28 గజాల స్థలంలో చిన్నపాటి ఇల్లు కట్టుకుంటే మీ అభ్యంతరం ఏమిటని ప్రశ్నించారు. అలాగే.. మీరు ఇల్లు కట్టుకోండని బాధిత కుటుంబానికి అండగా నిలిచారు. అలాగే రచ్చబండలో పింఛన్లు, రేషన్ కార్డులు, సీఎంఆర్ఎఫ్, వ్యక్తిగత సమస్యలు, రహదారుల నిర్మాణం కోసం పలువురు దరఖాస్తులు అందజేశారు.

సమస్యల పరిష్కారం కోసమే స్పందన



సబ్ కలెక్టర్ కార్యాలయంలో అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్ శ్రీనివాసరావు

సీటీఆర్ఐ: ప్రజా సమస్యల పరిష్కారం కోసమే స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు కోనేరు రంగారావు కమిటీ (కేఆర్‌సీ) తహసీల్దార్ ఎ.శ్రీనివాసరావు అన్నారు. సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన స్పందనలో ఆర్డీవో తరపున ఆయన పాల్గొని ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా రెవెన్యూ, నేషనల్ హైవే , పౌరసరఫరాలు అంశాలకు సంబంధించి ఐదుగురు అర్జీలు అందజేశారననారు. కార్యక్రమంలో ఆర్డీవో కార్యాలయ పరిపాలన అధికారి జీఎల్ఎస్ దేవి పాల్గొన్నారు.

రాజమహేంద్రవరం సిటీ: ప్రజా సమస్యల పరిష్కారానికి క్షేత్రస్థాయిలో అధికారులు, సిబ్బంది చొరవ చూపాలని నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ ఎం.సత్యవేణి అన్నారు. సోమవారం నగరపాలకసంస్థ కార్యాలయంలో నిర్వహించిన స్పందనలో 25 వినతులు స్వీకరించారు. ఆర్ఎంసీ సూపరింటెండెంట్ ఇంజినీర్ జి.పాండురంగారావు, సిటీ ప్లానర్ జీవీఎస్ఎన్ మూర్తి పాల్గొన్నారు.

పార్కులను సంరక్షించుకోవాలి



పార్కును శుభ్రం చేస్తున్న నగరపాలక సంస్థ కమిషనర్ దినేష్ కుమార్

రాజమహేంద్రవరం సిటీ: పార్కులను ప్రజలు స్వచ్ఛందంగా సంరక్షించుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ కె.దినేష్ కుమార్ పిలుపు నిచ్చారు. స్వచ్ఛతాహి సేవా ఇండియన్ స్వచ్ఛతా లీగ్ 2.0 కార్యక్రమంలో భాగంగా సోమవారం ఉదయం నగరంలోని పార్కులన్నీ శుభ్రం చేసే కార్యక్రమాన్ని రెసిడెంట్స్ అసోసియేషన్ ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు, సచివాలయ సిబ్బంది, విద్యార్థులతో కలిసి ఆయన చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆర్ఎంసీ పరిధిలో పలు ప్రాంతాలను, పార్కులను కోట్ల రూపాయలతో అభివృద్ధి చేస్తున్నామన్నారు. మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ ఎ.వినూత్న, శానిటరీ సూపర్‌వైజర్లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సచివాలయ సిబ్బంది, విద్యార్థులు, వాకర్స్ అసోసియేషన్ సభ్యులు, ప్రజలు పాల్గొన్నారు.

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
కొంతమూరు శాఖ, తూ॥గో॥ జిల్లా,
బంగారు నగల వేలం ప్రకటన
[illegible]

క్ర. నెం.	అప్పు ఖాతా నెం.	ఖాతాదారుని పేరు	ప్రస్తుత బకాయి	మొత్తం బరువు (గ్రా.లలో)
1	[illegible]	[illegible]	[illegible]	[illegible]

[illegible]
తేది: 25-09-2023
స్థలం : [illegible]
* ప్రకటన ఖర్చులు అదనం
సం/- బ్రాంచ్ మేనేజర్